క్లుప్తంగా

సేవల్లో ముందుండటం అభినందనీయం



సొసైటీ సభ్యులను సన్మానిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: దివ్యాంగులు సేవ కార్యక్రమాల్లో ముందుండటం అభినందనీయమని కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. హ్యాండీక్యాప్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకల్యం దేహానికే కాని మేధస్సుకు కాదని, సేవ చేయాలనే తపన ఉంటే అనేక మార్గాలుంటాయని నిరూపించారని కొనియాడారు. దివ్యాంగులు అయినప్పటికీ సొసైటీ ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా వివిధ సామాజిక కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ముమ్ముందు కొనసాగించాలని కోరారు. సొసైటీ అధ్యక్షుడు ఇమ్రాన్, సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



సాయితేజరెడ్డిని సన్మానిస్తున్న ఏఈవోలు

బేల: మండలకేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారిగా సాయితేజరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఏఈవోలు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా సాయితేజరెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందిస్తానని తెలిపారు. ఏఈవోలు సాయికిరణ్, ఉమర్, రాజు, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల మండల కమిటీ ఎన్నిక

తలమడుగు: తెలంగాణ ఉద్యమకారుల మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భీమవేని ఆశన్న యాదవ్, ఉపాధ్యక్షులుగా దారట్ల జనార్దన్, టీఎస్ శాస్త్రి, ప్రధాన కార్యదర్శిగా గిస మల్లయ్య, కార్యదర్శులుగా మొట్ట కిరణ్ కుమార్, శేర్ల పోచన్న, సంయుక్త కార్యదర్శులుగా చిందం లచ్చన్న, ఎస్‌కే ఉమ్మర్, కోశాధికారిగా సురుకుంటి వెంకటరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సుదర్శన్, తోట వెంకటేశ్, ఎస్‌కే అబ్దుల్లా, లక్ష్మారెడ్డి, మగ్గడి ప్రకాశ్, బాపు, చింతలపల్లి దేవరెడ్డి, ఎలుగు లింగన్న, తోట ప్రమోద్ ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యుడు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.

కొనసాగుతున్న ఐకేపీ వీవోఏల సమ్మె

ఆదిలాబాద్‌టౌన్: ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సీఐటీయూ జిల్లా నాయకుడు లింగాల చిన్నన్న అన్నారు. కలెక్టరేట్ ఎదుట 48 గంటల సమ్మెలో భాగంగా రెండో రోజు మంగళవారం సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సంఘం నుంచి రూ.3వేల వేతనం చెల్లించాలని, ప్రతినెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న వీవోఏలకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. సంఘం నాయకులు అరుణ్, ఫిరోజ్, లక్ష్మణాచారి, రాజేశ్, బారిక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'లంబాడాలను వేధిస్తోందన్న ప్రభుత్వం'

నేరడిగొండ: ప్రభుత్వం లంబాడాలను వేధిస్తోందని లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్మా కంపెనీల పేరుతో సీఎం సొంత నియోజకవర్గంలోని రైతులు, ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. లంబాడాల భూములను అక్రమంగా లాక్కోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. సమాచారం లేకుండా సోమవారం కలెక్టర్, జాయింట్ కలెక్టర్, తహసీల్దార్, 500 మంది పోలీసులతో తండాలపై దాడులు చేశారని ఆరోపించారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో గిరిజనులను రెచ్చగొట్టే విధంగా మాట్లాడారని అన్నారు.

నేడు ఆలిండియా బంజారా సేవా సంఘం సమావేశం

నేరడిగొండ: బోథ్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆలిండియా బంజారా సేవా సంఘం మండల సమావేశం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు రూపావత్ బాబులాల్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జనరల్ సెక్రెటరీ, రిటైర్డ్ ఈఈ రాథోడ్ భీంరావ్ హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశానికి గ్రామాల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, ప్రతి తండా నుంచి నాయక్, కారోబారులు, గ్రామ పెద్దలు రావాలని సూచించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

- నేడు లక్ష్మీనారాయణస్వామివారి కల్యాణోత్సవం
- 20న రథోత్సవం..20 నుంచి 27 వరకు జాతర
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఫైల్), ఇన్‌సెట్‌లో స్వామివారు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జిల్లాలోని జైనథ్ మండల కేంద్రంలో అతిప్రాచీన శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి వైభవంగా జరగనున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నిఏర్పాట్లు పూర్తిచేశారు. విద్యుత్ కాంతులతో విరజిమ్మేలా ఆలయాన్ని ముస్తాబు చేశారు. బుధవారం స్వామివారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరగనుంది. ఈ వేడుకలను తిలకించేందుకు జిల్లా నలుమూల నుంచే కాక మహారాష్ట్ర నుంచి వేలాది భక్తులు తరలివస్తారు. బ్రహ్మోత్సవాల్లో స్వామివారిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోతాయని, కోరిన కోర్కెలు తీరుతాయని వారి నమ్మకం.

నేటి నుంచి..

13న లక్ష్మీనారాయణ స్వామి కల్యాణ మహోత్సవం, 20న రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టనున్నారు. 15న శేషవాహన సేవ, 16న గజవాహన సేవ, 17న అశ్వవాహన సేవ, 18న రాత్రి హన్మత్ వాహనసేవ, 19న అఖండజ్యోతి వెలిగిస్తారు. 20న కార్తిక బహుళపంచమి రోజున స్వాముల దీక్ష విరమణ చేపడతారు. పెద్ద రథంపై స్వామివారిని గ్రామ వీధులగుండా ఊరేగిస్తారు. అనంతరం ఆలయ ఆవరణలో జాతర నిర్వహిస్తారు. స్వామివారి రథోత్సవాన్ని వందేళ్లుగా నిర్వహిస్తూ వస్తున్నారు. గ్రామ ప్రధాన వీదుల గుండా సాగే రథోత్సవాన్ని వీక్షించడానికి జిల్లా నలుమూల నుంచే కాక మహారాష్ట్ర నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఆలయ కమిటీ సభ్యులు ఇప్పటికే ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

ఆలయ ప్రస్థానం ఇదీ..

జైనథ్‌లోని అత్యంత ప్రాచీనమైన లక్ష్మీనారాయణస్వామి ఆలయాన్ని 11, 13వ శతాబ్దంలో జైనుల హయాంలో నిర్మించారని పూర్వీకులు చె బుతుంటారు. ఉన్నతమైన శిఖరం కలిగి, గొప్ప శిల్పకళతో నిర్మించిన ఆలయానికి ముందు భాగంలో పెద్ద జలాశయం ఉంది. ప్రతీఏటా కార్తికశుద్ధ ఏకాదశి నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తారు. ఈసారి బుధవారం నుంచి 20 వరకు బ్రహ్మోత్సవాలు, 20 నుంచి 27 వరకు జాతర కొనసాగనుంది. దీనికి సంబంధించి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని వీక్షించడానికి అధికసంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

'మహారాష్ట్రలో బీజేపీదే గెలుపు'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్



కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న ఆడే గజేందర్

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: మహారాష్ట్రలో బీజేపీదే గెలుపు ఖాయమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మహారాష్ట్రలోని వార్ధా నియోజకవర్గంలోని బోర్‌గావ్‌లో పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్ధా నియోజకవర్గం బీజేపీ హయాంలో ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే కనిపిస్తారని ఎద్దేవా చేశారు. నిత్యం ప్రజల్లో ఉండే బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పంకజ్ బోయర్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'మహ' ఎన్నికల ప్రచారంలో గజేందర్

నేరడిగొండ: మహారాష్ట్ర సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పాత్రి నియోజకవర్గానికి కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఆడే గజేందర్ ప్రచారంలో పాల్గొంటున్నారు. పార్టీ అభ్యర్థి సురేష్ వధువుడ్కర్ గెలుపే లక్ష్యంగా మంగళవారం మానవత్ తాలూకాలో కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.

సెక్యూరిటీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

బేల: బాసర ట్రిపుల్ ఐటీలో పీయుసీ 2 చదువుతున్న స్వాతిప్రియ మృతిపై ప్రశ్నించడానికి వెళ్లిన ఏబీవీపీ నాయకులపై దాడి చేసిన సెక్యూరిటీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీశ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థిని ఆత్మహత్యపై ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏబీవీపీ సభ్యులు రేసు మనోజ్‌రెడ్డి, నార్లవార్ అజయ్, పిన్నం శ్రీనివాస్, సచిన్, సుధాం, బాలాజీ, అంకుల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరీశ్‌రెడ్డి

ఎమ్మెల్యేను కలిసిన ఏవో, ఏఈవోలు

నేరడిగొండ: నూతనంగా ఏవోగా బాధ్యతలు చేపట్టిన కృష్ణవేణితోపాటు ఏఈవోలు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి పలు సమస్యలు విన్నవించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి పంటల సాగుపై సలహాలు, సూచనలు చేయాలన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయ రంగం అన్నివిధాలుగా అభివృద్ధి చెందిందని తెలిపారు. ఇందులో ఏఈవోలు సౌజన్య, శ్యామ్, జైపాల్, గజేందర్, మహేందర్, అపర్ణ, శిధర్ ఉన్నారు.



ఏవో, ఏఈవోలతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

కార్తిక దీపోత్సవం

నేరడిగొండ: కార్తికమాసం సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కార్తిక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలంకరణ చేశారు.

బోథ్: బోథ్‌లోని శ్రీ శివభక్త మార్కండేయ ఆలయంలో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు లింగ రూపంలో దీపాలు వెలిగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రమోహన్, కోశాధికారి నగేశ్, ప్రసాద్, పట్టణ గౌరవ అధ్యక్షుడు మల్లేశ్, అధ్యక్షుడు భోజన్న, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, వేద పండితుడు అరవింద్‌శర్మ పాల్గొన్నారు.



నేరడిగొండ: దీపాలంకరణ చేస్తున్న మహిళలు



బోథ్: శివభక్త మార్కండేయ ఆలయంలో..

నల్లబ్యాడ్జీలతో నిరసన



సిరికొండలో నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది



ఇచ్చోడలో నిరసన తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

ఇచ్చోడ: వికారాబాద్ జిల్లా లగచర్లలో రెవెన్యూ అధికారులపై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అధికారులపై దాడులు చేయడం సరికాదన్నారు. డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రమేశ్, ఆర్ఐ హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

సిరికొండ: తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ తుకారం మాట్లాడుతూ వికారాబాద్ కలెక్టర్, అధికారులపై దాడి చేసిన వారిని చర్యలు తీసుకోవాలన్నారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలి అప్పగింత

ఆదిలాబాద్‌టౌన్: మతిస్థిమితం లేని వృద్ధురాలిని ఆమె కుటుంబీకులకు అప్పగించినట్లు సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి తెలిపారు. గతనెల క్రితం మావల మండలం వాగాపూర్ శివారు రోడ్డు పక్కన ఓ వృద్ధురాలు పడి ఉండడంతో స్థానికులు గమనించి రిమ్స్‌లో చేర్పించినట్లు పేర్కొన్నారు. చికిత్స పొందిన ఆమె కుటుంబీకుల వివరాలు చెప్పలేని స్థితిలో ఉంది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం కుదుటపడడంతో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ జిల్లా సంక్షేమ అధికారికి సమాచారం అందించారు. దీంతో సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, కౌన్సిలర్ లావణ్య రిమ్స్‌కు చేరుకుని డైరెక్టర్‌ను కలిశారు. వృద్ధురాలితో మాట్లాడగా తన పేరు సరోజ, దుబ్బాల గ్రామం, తదితర వివరాలను తెలిపినట్లు వివరించారు. ఆమె చెప్పిన వివరాలను నమోదు చేసుకున్న సఖీ కేంద్రం నిర్వాహకులు జయశంకర్ భూపాలపల్లి జిల్లాగా గుర్తించారు. అక్కడి సఖీ కేంద్రం అడ్మినిస్ట్రేటర్ గాయత్రికి వివరాలతోపాటు ఫొటోను పంపించారు. మంగళవారం వృద్ధురాలి కుమారుడు, కోడలు రమేశ్, కవిత జిల్లా కేంద్రానికి వచ్చారు. వారికి మతిస్థిమితం లేని వృద్ధురాలిని అప్పగించారు. కుటుంబీకులు రిమ్స్ డైరెక్టర్‌తోపాటు సఖీ కేంద్రం నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.



వృద్ధురాలిని కుటుంబీకులకు అప్పగిస్తున్న సఖీ కేంద్రం నిర్వాహకులు

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

నార్నూర్: మండలంలోని మాన్కాపూర్ శ్రీ గజానంద్ జిన్నింగ్ మిల్లులో మంగళవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సీపీవో నరేశ్, బీజేపీ నాయకుడు రితేష్ రాథోడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐదుగురు రైతులను వారు సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ తేమ శాతాన్ని బట్టి ధరలు నిర్ణయించామన్నారు. 12 శాతం పైన తేమ ఉంటే పత్తి కొనుగోలు చేయరని తెలిపారు. గ్రామ పటేల్ మెస్రం రూప్‌దేవ్, నాయకులు బాబులాల్ రాథోడ్, యశ్వంత్‌రావు చౌహాన్, రైతులు పాల్గొన్నారు.

తేమ శాతం పెంచాలి

బోథ్: పత్తి తేమ శాతాన్ని ప్రభుత్వం పెంచాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న అన్నారు. పలు జిన్నింగ్ మిల్లుల్లో పత్తిని పరిశీలించారు. రైతులకు భరోసా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులు చంద్రకాంత్, రాములు, అశోక్ బషీర్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి, రాష్ట్ర అధికార ప్రతినిధి పదాల రవీందర్ కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో ప్రజావాణి ఇన్‌చార్జి, ఐఏఎస్ అధికారి దివ్య దేవరాజన్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. సమస్యలు పరిష్కరించాలని కోరగా న్యాయం చేస్తానని ఆమె హామీ ఇచ్చినట్లు తెలిపారు.



వినతిపత్రం అందిస్తున్న సంఘ ప్రతినిధులు

రెగ్యులర్ పోస్టులు భర్తీ చేయాలి



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ కేబీ ప్రాంగణంలో కొనసాగుతున్న బీఈడీ కళాశాలలో రెగ్యులర్ లెక్చరర్, నాన్‌టీచింగ్ సిబ్బందిని భర్తీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. సంఘం నాయకులతో కలిసి మంగళవారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట సంఘం జిల్లా కార్యదర్శి తొడసం భీంరావు, మండల అధ్యక్షుడు కనక మల్కు, కార్యదర్శి మడావి నాగోరావు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఇంటింటా సర్వే

నేరడిగొండ: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటా సర్వే గ్రామాల్లో కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం మండలంలోని కుమారి, వడూర్, వాంకిడి, బుగ్గారం, తేజపూర్, తర్నం తదితర గ్రామాల్లో ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లను అతికించడంతోపాటు వివరాలను సేకరిస్తున్నారు. ఈ సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.

గుడిహత్నూర్: మండలంలోని కొల్హారీ గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింటా సర్వేను మండల ప్రత్యేక అధికారి సునీత పరిశీలించారు. ఈ సందర్భంగా ఎదురవుతున్న సమస్యలను సర్వే ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. కాగా, కాయిదిలబాన కులం పేరు సర్వే నివేదికల్లో లేకపోవడంతో కులస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు. తహసీల్దార్ కవితరెడ్డి, ఎంపీడీవో అబ్దుల్‌హై, ఎంఈవో ఉదయ్‌రావ్, ఎంపీవో దిలీప్, కార్యదర్శి అంజలి, అంబరీశ్, తగిరే ప్రకాశ్ ఉన్నారు.



కుమారిలో సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్

ఇంద్రవెల్లి: మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో సర్వే కొనసాగుతోంది. అధికారులు, ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించి నమోదు చేస్తున్నారు. గ్రామాల్లో మంగళవారం సర్వే తీరును తహసీల్దార్ ప్రవీణ్, ఎంపీడీవో భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్ పరిశీలించారు. అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నిత్యావసరాలు అందజేత



సరుకులు ఇస్తున్న మౌనిష్‌రెడ్డి

తలమడుగు: మండలంలోని ఉండం గ్రామంలో ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో శంకరమ్మ ఇల్లు దగ్ధమైంది. బాధిత కుటుంబానికి మంగళవారం సామాజిక కార్యకర్త ముడుపు మౌనిశ్‌రెడ్డి పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన వెంట గ్రామస్తులు అశోక్, రాజేశ్వర్, అప్సర్, లక్ష్మారెడ్డి, వంశీ, దినేష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవం

బజార్‌హత్నూర్: మండలంలోని గిర్నూర్ పంచాయతీ పరిధిలోని కనకాయి అటవీ ప్రాంతంలో గల కనకదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. వీడీసీ చైర్మన్ మహేందర్, మాజీ సర్పంచ్ కృష్ణ, ఉప సర్పంచ్ వినోద్, సాయిచైతన్య, ఉపేందర్, సత్యనారాయణ, దిలీప్, రాము, రాములు, నారాయణ, రాజు, నవీన్ పాల్గొన్నారు.

నేడు చర్లపల్లిలో..

తలమడుగు: మండలంలోని చర్లపల్లిలో బుధవారం శివాలయ వార్షికోత్సవం జరగనుంది. ఆలయంలో అభిషేకాలు, యజ్ఞం, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ఉట్నూర్‌రూరల్: జిల్లా కేంద్రంలో ఈనెల 28, 29న నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కమిటీ సభ్యుడు తొడసం భీంరావు కోరారు. మండలంలోని భీంజీగూడలో మంగళవారం ఆయన మాట్లాడారు. మహాసభలకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్, రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పూసం సచిన్, నాయకులు కనక మల్కు, నాగోరావు పాల్గొన్నారు.

సన్మానం

బోథ్: మండల మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ఎలుక రాజును మిత్ర బృందం సభ్యులు మంగళవారం సన్మానించారు. జక్కుల వెంకటేశ్, కదం ప్రశాంత్, రంగు రాజు, పెంట నరేందర్ తదితరులు ఉన్నారు.

19న రక్తదాన శిబిరం

నార్నూర్: గాదిగూడ మండలం ఝరి పీహెచ్‌సీలో ఈనెల 19న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆదివాసీ గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు మెస్రం శేఖర్‌బాబు తెలిపారు. ఝరిలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు. యువకులు ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు. తుడుందెబ్బ నాయకులు మాడవి చంద్రహరి, గ్రామ పటేల్ మెస్రం సోము, విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ ఉన్నారు.

ఉద్యోగాలు సాధించడం అభినందనీయం

తాంసి: ఏఎన్ఎంగా ఉద్యోగాలు సాధించిన మహిళలను డీఐఈ వో రవీందర్‌కుమార్ అభినందించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు పూర్తి చేసి ఇటీవల ఏఎన్ఎం ఉద్యోగాలు సాధించిన మహిళలను ప్రిన్సిపాల్ సుదర్శన్‌తో కలిసి మంగళవారం సన్మానించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సంతోశ్, అధ్యాపకులు రమణారెడ్డి, తిరుపతిరెడ్డి, దేవేందర్, శశికుమార్ పాల్గొన్నారు.

మాదిగ ఉద్యోగుల సభను జయప్రదం చేయాలి

గుడిహత్నూర్: ఆదిలాబాద్‌లోని బీసీ భవన్‌లో ఈనెల 17న నిర్వహించే మాదిగ ఉద్యోగుల సభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగు గంగయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు మాదిగ ఉద్యోగుల సమైఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవేంద్రప్రసాద్ హాజరవుతారని పేర్కొన్నారు. మాదిగ ఉద్యోగులు తరలిరావాలని కోరారు.